క్లుప్తంగా

దింపు కార్మికుడి మృతి

అంబాజీపేట: కొబ్బరికాయలు దింపు తీస్తుండగా బుధవారం ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడు మృతి చెందారు. అల్లవరం మండలం ఎంట్రుకోనకు చెందిన అయినవిల్లి శ్రీనివాసరావు (55) మొసలపల్లి శివారు బొక్కావారిపాలెంలో కొబ్బరికాయలు దింపు తీస్తుండగా చెట్టుకు సమీపాన ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తూ తగలడంతో మృతి చెందాడన్నారు. అతడిని కొబ్బరిచెట్టుపై నుంచి దించే సరికి మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసినట్టు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

పానీపూరీ బండిని ఢీకొట్టిన ట్రాక్టర్



అంబాజీపేటలో బోల్తా కొట్టిన పానీపూరీ బండి

అంబాజీపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం ప్రధాన రహదారి పక్కనే ఉన్న పానీపూరి బండిని కొబ్బరి లోడు ట్రాక్టర్ ఢీ కొట్టింది. అంబాజీపేట నుంచి మాచవరం వెళుతున్న కొబ్బరి లోడు టాక్టర్ ఢీ కొట్టడంతో పానీ పూరీ బండి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పానీపూరికి సంబంధించి రూ.30 వేలు విలువ చేసే సామగ్రి, బండి ధ్వంసమయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఆలయ అభివృద్ధికి రూ.21 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన గోపరాజు శిరీష్, అలేఖ్య దంపతులు రూ.21 వేల విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. గతంలో స్వామి వారి అన్నదాన పథకానికి ఈ దాతలు రూ.1,01,116 విరాళం అందించినట్లు తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చేతుల మీదుగా అందజేశారు.

ర్యాబిస్ ప్రాణాంతకం

అంబాజీపేట: ర్యాబిస్ ప్రాణాంతకమైన వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన కుక్కలు, మనుషులను ఇతర జంతువులను కరవడం వలన వ్యాపిస్తోందని వీటిపై జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అన్నారు. అంబాజీపేట పశు వైద్యకేంద్రం వద్ద జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ర్యాబిస్ వ్యాధి లక్షణాలు బయటపడిన తర్వత ఈ వ్యాధికి చికిత్స లేదని వివరించారు.

మలికిపురం: ప్రపంచ జునోసిస్ డేను లక్కవరం పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ప్రపంచ సాంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. అలాగే గుడిమెళ్లంక, మలికిపురం ఆసుపత్రుల వద్ద కూడా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌లు వేశారు. ఏహెచ్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఎల్.అనిత ఆధ్వర్యంలో ప్రపంచ జంతు వ్యాధి నివారణ (జునోసిస్) దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఏడీఏ కార్యాలయం ఆవరణలోని పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలను ఏడీఏ అందజేశారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

కొత్తపేట: నాడు కశ్మీర్‌తో కలిపి దేశానికి ఇద్దరు ప్రధానులు, జాతీయ జెండాలను వ్యతిరేకించి తనకు రాజకీయ ప్రయోజనాల కన్నా జాతీయ ప్రయోజనాలే ముఖ్యమంటూ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్‌ముఖర్జీ రాజీలేని పోరాటం చేసారని రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం తెలిపారు. ముఖర్జీ జయంతిని గురువారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. పాలాటి మాధవస్వామి, పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అప్పట్లో కశ్మీర్, పాకిస్తాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి మంత్రివర్గం నుంచి బయటకు వచ్చి మెజార్టీ ప్రజల మనోభావాలను గౌరవించే పార్టీ అవసరమని భావించి భారతీయ జనసంఘ్‌ను స్థాపించారని వివరించారు. నాటి నుంచీ 'ఏక్ భారత్' లక్ష్య సాధన కోసం తన ప్రాణాలను బలిదానం చేసిన మహా నేత శ్యామాప్రసాద్‌ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మద్దింశెట్టి శ్రీనివాసరావు, ప్రసాదరాజు, పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవుల అక్రమ రవాణా అడ్డగింత

అంబాజీపేట: కబేళాకు అక్రమంగా తరలిస్తున్న ఆవులను గురువారం రాత్రి మాచవరం గ్రామస్తులు, యువకులు అడ్డుకున్నారు. అంబాజీపేట నుంచి సుమారు 13 ఆవులను వ్యాన్‌లో అక్రమంగా గుంటూరుకు తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం వ్యాన్‌ను అంబాజీపేట పోలీసులకు అప్పగించారు. అనంతరం మాచవరంలో ఉన్న గోశాలకు ఆవులను తరలించారు. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి వ్యాన్ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

- సబ్‌స్టేషన్‌కు రూ.5 కోట్లు మంజూరు
- పాశర్లపూడిలంకలో కార్యాచరణ

మామిడికుదురు: విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోవడం, లో–వోల్టేజీ సమస్య తదితర సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పాశర్లపూడిలంక గ్రామ పరిధిలో వాడబోది మీడియం డ్రైన్‌ను అనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు కార్యాచరణ చేపట్టారు. 42 సెంట్ల విస్తీర్ణంలో సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు గాను లెవెలింగ్ పనులు చేపట్టారు. పల్లంగా ఉన్న స్థలాన్ని మెరక చేయించడంలో కొంత జాప్యం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



పాశర్లపూడిలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలంలో చేపట్టిన లెవెలింగ్ పనులు

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో లెవెలింగ్ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. లెవెలింగ్‌కు గాను సుమారుగా రూ.15 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

12 గ్రామాలు.. 5 మెగావాట్లు..

అయిదు మెగావాట్ల సామర్థ్యంతో నూతన సబ్ స్టేషన్ నిర్మించనున్నారు. ప్రస్తుతం నగరం, మగటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని 12 గ్రామాలను కొత్త సబ్ స్టేషన్‌లో విలీనం చేయనున్నారు. 12 గ్రామాల్లో ఉన్న సుమారు ఎనిమిది వేల కనెక్షన్లను ఈ సబ్ స్టేషన్ పరిధిలోకి తీసుకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. పాశర్లపూడిలంక, పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, లూటుకుర్రు, బాడిలంక, మాకనపాలెం, ఆదుర్రు, ఈదరాడ, కొమరాడ గ్రామాలు కొత్త సబ్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లపై భారం తగ్గుతుంది. దీంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల లంక గ్రామాలకు తరచూ నిలిచిపోయే విద్యుత్ సరఫరా వంటి సమస్యలు కూడా తొలగిపోతాయి.

సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం



లో–వోల్టేజీ సమస్యతో పాటు తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం. సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం. దీని నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి కష్టాలకు చెక్ పెట్టాలని కోరుతున్నాం. ఇంత కాలానికి ఇది సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఆకే రాజా, లూటుకుర్రు

ఎంతో మందికి మేలు



ప్రకృతి వైపరీత్యాల సమయంలో గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కురిసినా, గాలులు వీచినా కరెంటు కష్టాలు తప్పడం లేదు. సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు చాలా సమయం పడుతుంది. కొత్త సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం.

– కొమ్ముల వీరబాబు, పెదపట్నంలంక

యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నాం



కలెక్టర్ హిమాన్షుశుక్లా చొరవతో సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం స్థలం లెవెలింగ్ పనులు చేపట్టాం. సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయిస్తాం. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా విద్యుత్ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నదే నా తపన. గత ప్రభుత్వాలు ఈ సమస్యపై దృష్టి సారించలేదు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరిస్తున్నా.

– కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్యే, పి.గన్నవరం

సంక్షేమసారథిని ఆశీర్వదించండి

పి.గన్నవరం: పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంక గ్రామంలో నాలుగో రోజైన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సొసైటీ కమిటీ చైర్మన్ భీమాల సూరిబాబు, పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వరరావు, చికిలే ప్రసాద్ తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన మేలును తెలియజేశారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని చిట్టిబాబు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పితాని నర్సింహారావు, దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్, యల్లమెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారి శ్రవణ జన్మనక్షత్రం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మద్దింశెట్టి ఆదిబాబు దంపతులతో భారీ అన్నసమారాధన చేపట్టారు. అంతకు ముందు స్వామికి లక్షతులసి పూజలు చేశారు.

కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మామిడికుదురు: కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. జగనన్న అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా లూటుకుర్రు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన సమావేశంలో 11 గ్రామాలకు చెందిన 3,698 విద్యార్థులకు రూ.2.75 కోట్లు విలువైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంఈఓ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చి వేశారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో విద్యా కానుక, అమ్మ ఒడి తదితర కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంఈఓ మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం జి.నాగప్రసాద్, పీఏంసీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



లూటుకుర్రులో అమ్మఒడి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం మోరిలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. చిన్న, చిన్న కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ పి.లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గాసూర్యావతి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన రాంబాబు, వీవర్స్ సొసైటీ చైర్మన్ జాన శంకరరావు, జాన సునీల్, నాయకులు వలవల రాంబాబు, పి.భగవాన్ శ్రీనివాస్, తాడి సహదేవ్, రొక్కాల వెంకట్ పాల్గొన్నారు.



మోరిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

వీవీమెరకలో గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రాపాక శంకుస్థాపన చేశారు. అలాగే గడప గడపకూ కార్యక్రమం ప్రారంభించి 150 రోజులు పూర్తయిన సందర్భంగా మోరిలో పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు.

తాగునీటి పథకం పరిశీలన

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఇంటింటికీ తాగునీరు అందించే గుడిమెళ్లంక తాగునీటి ప్రాజెక్టును గురువారం బీజేపీ నాయకుల బృందం పరిశీలించింది. ప్రాజెక్టు పనితీరుపై నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శివారు గ్రామాలకు సైతం తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్‌జీవన్ మిషన్‌ను నిర్వీర్యం చేయడానికే అధికారులంతా పథకం ప్రకారం పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆరోపించారు. సముద్రతీర ప్రాంతంలో 20 రోజుల నుంచి గ్రామాలకు మంచినీళ్లు లేవని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అచ్యుత రామరాజు మాట్లాడుతూ ప్రాజెక్టులో వివరణ ఇచ్చే అధికారులు కూడా లేరని పేర్కొన్నారు. పనితీరు మారకుంటే ఉద్యమం మొదలు అవుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ హెచ్చరించారు.



గుడిమెళ్లంక ప్రాజెక్టును పరిశీలించిన బీజేపీ బృందం

భారీ వాహనాలతో ట్రాఫిక్ జామ్

ఆలమూరు: సరైన రక్షణ చర్యలు లేకుండా ఓఎన్‌జీసీకి చెందిన భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఆలమూరులోని యూనియన్ బ్యాంకు సమీపాన భారీ వాహనం ప్రయాణిస్తుండగా మలుపు వద్ద తిరగలేక కొద్దిసేపు నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా వచ్చే వాహనాలు అక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో స్థానికుల సాయంతో ఆ భారీ వాహనం నెమ్మదిగా మలుపు దాటి గమ్యస్థానానికి వెళ్లిపోయింది. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు కనీసం ఇద్దరు ముగ్గురు సహాయకులు ఉండి ఏ విధమైన అంతరాయం కలగకుండా, విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇటీవల ఓఎన్జీసీ కనీస జాగ్రత్తలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



జొన్నాడలో కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ తదితరులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుని అత్యాధునిక చికిత్స అందజేస్తుందని జిల్లా డీపీఎంఓ పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆలమూరు, జొన్నాడ, మూలస్థానం అగ్రహారం, మడికి తదితర గ్రామాల్లో వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.మల్లికార్జున, డి.సువర్చలా నాయుడుతో కలసి గురువారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ఆరోగ్య, ఆశ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు కుష్టు వ్యాధి లక్షణాలు–నివారణ చర్యలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

పందులను ఊరిపై వదిలితే కఠినచర్యలు తప్పవు

అంబాజీపేట: పంటలను నాశనం చేస్తున్న పందులను వాటి పెంపకందారులు ఐదు రోజుల్లోగా జాగ్రత్తగా పెట్టుకోవాలని లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఎల్పీఓ పి.బొజ్జిరాజు అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయంలో రైతులు, పందుల పెంపకం దారులతో పంచాయతీ కార్యదర్శి కుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పందుల వల్ల తరచూ పంటలు ధ్వంసమవుతున్నాయని, దాని వల్ల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. రైతులు నష్టపోకుండా పందులను అరికట్టాలని డీఎల్పీవోను కోరారు. దీనిపై డీఎల్పీవో స్పందించి మాట్లాడుతూ ఐదు రోజుల్లోగా ఎవరి పందులు వారు జాగ్రత్త చేసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రైతులు కొర్లపాటి కోటబాబు, నక్కా భాస్కరరావు, మట్టపర్తి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగువర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

కొత్తపేట: అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల పాలిట ఆశాజ్యోతిగా నిలిచారని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ ప్రాంగణంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, షేక్ బడేమియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉందుర్తి నాగేశ్వరరావు, ఆకుమర్తి శ్రీనుబాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సుంకర రెడ్డినాయుడు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ ప్రాంతాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మామిడికుదురు: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ కూడలిలోని విగ్రహానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ నేతలు చుట్టుగుళ్ల కిశోర్, ముసూడి నరసింహస్వామి, సిర్రా శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, అప్పన శ్రీరామకృష్ణ, తోట వెంకన్న తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబాజీపేట: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి తరం యువత కృషి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అంబాజీపేట ఎంపీపీ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న విగ్రహం వద్ద కె.పెదపూడిలోనూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ఎం.ప్రశాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.నాగరాజు, కె.శ్రీను, ఎ.శ్రీను, మైలా ఆనందరావు, సూదాబత్తుల రాము పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంకలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి కూడా చిట్టిబాబు నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కట్టుంగలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



నాగుల్లంకలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కొత్తపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ గంగాధరరావు



అంబాజీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- కట్టుంగలో గడప గడపకూ..

ఆత్రేయపురం: అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడానికే సీఎం జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని కట్టుంగలో సర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీ, ఎంపీటీసీ కేతా వరలక్ష్మి, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు పలు సమస్యలు ఏకరువు పెట్టారు. డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరేలా సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి నాలుగేళ్లలో గ్రామంలో బీసీ లబ్ధిదారులకు రూ.2,08,95,354, ఎస్సీ లబ్ధిదారులకు రూ.4,22,49,099, ఎస్టీ లబ్ధిదారులకు రూ.8,03,022, మైనార్టీ లబ్ధిదారులకు రూ.46,09,584, కాపు లబ్ధిదారులకు రూ.2,06,06,215, ఇతర వర్గాల లబ్ధిదారులకు రూ.1,16,43,757 , మొత్తం రూ.10,08,07,031 వివిధ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ పెన్మెత్స సురేష్‌రాజు, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కట్టుంగలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

చెరువును రుడాలో అభివృద్ధి చేయాలి

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో ఉన్న పంచాయతీ చెరువును రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)లో అభివృద్ధి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ మేరకు రాజమహేంద్రవరం కార్యాలయంలో చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డిని గురువారం ఆయన కలిసి గ్రామాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. దీనిపై స్పందించిన ఆమె ఆ చెరువును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని రాంబాబు తెలిపారు.

జగనన్న సురక్షలో ఉచిత సేవలు

అయినవిల్లి: జగనన్న సురక్షలో ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను తాము నివాసం ఉన్న గ్రామంలో ఉచితంగా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం అయినవిల్లి మండలంలోని క్రాప శంకరాయగూడెం, కొండుకుదురు సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచులు బొబ్బిలి సీతాదేవి, మేడిశెట్టి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హాజరయ్యారు. ఈ రెండు గ్రామాల్లో ప్రజలకు 1805 సర్టిఫికెట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, శంకరాయగూడెం సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీరామ్మూర్తి, నాయకులు బొక్కా కొండయ్య, సవరపు వేడుకొండలు, గంజి పేరయ్యనాయుడు, బొబ్బిలి అయ్యప్ప, దామిశెట్టి అంజి తదితరులు ఉన్నారు.

పి.గన్నవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల కోసం అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ముంగండ–1, 2 గ్రామ సచివాలయాల్లో గురువారం తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష సభల్లో ఆమె పాల్గొన్నారు. మొత్తం 1020 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 59 మందికి ఆధార్ సేవలు అందించారు. ముంగండ సర్పంచ్ కుసుమ చంద్రకళ, ఎంపీటీసీ ముక్కామల భారతి, ఉప సర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య, కుసుమ వెంకటేశ్వరరావు, అహ్మద్ వలీ, గంగా పెద్ద, కుసుమ కల్యాణ్, డీటీ బి.గోపాలకృష్ణ, ఈఓ అండ్‌పీఆర్డీ ఏవీవీఎస్‌ఎం శరభరాజు, పంచాయతీ కార్యదర్శి గుత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.



ముంగండలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ భూలక్ష్మి తదితరులు